సాక్షి అనకాపల్లి

సోమవారం । 18 । డిసెంబర్ । 2023



ఉల్లాసంగా మారథాన్

వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంధ్య మెరైన్స్ వైజాగ్ మారథాన్ ఉల్లాసంగా సాగింది.

8లో



ఆకట్టుకున్న ఇంద్రప్రస్థ

మునగపాకలో ఆదివారం రాత్రి ప్రదర్శించిన ఇంద్రప్రస్థ నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

8లో



గంజాయి నిందితుల అరెస్టు

నర్సీపట్నం, రోలుగుంట మండలాల్లో గంజాయి తరలిస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

8లో

న్యూస్‌రీల్

మెడికల్ కళాశాల పనుల పరిశీలన



కళాశాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: మండలంలోని భీమబోయిన పాలెం వద్ద రూ.500 కోట్లతో ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కళాశాల నిర్మాణ పనులను ఆదివారం నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పరిశీలించి, ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కళాశాల నిర్మాణం పూర్తయితే వేలాది మందికి మెరుగైన వైద్యసేవలు అందుతాయని చెప్పారు. ఈ నెల 30న నర్సీపట్నంలో జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్రకు హాజరయ్యే మంత్రులు, ఇతర ముఖ్యనేతలు ఈ కళాశాల పనులను పరిశీలించనున్నట్టు చెప్పారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లాకార్యదర్శి గోవింద రావు, భద్రాచలం, తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు హరిబాబు, యూత్ అధ్యక్షుడు శ్రీను, యూత్ జిల్లా కార్యదర్శి నాయుడు పాల్గొన్నారు.

వేదమంత్రాల్లో ఆధ్యాత్మిక రహస్యాన్ని గ్రహించాలి

ఆర్డీవో జయరాం



మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: వేదమంత్రాల్లోని ఆధ్యాత్మిక రహస్యాలను ప్రతి ఒక్కరూ గ్రహించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం తెలిపారు. స్థానిక శారదా నగర్ నవనిర్మాణ సమితి కార్యాలయంలో వేద మంత్రాల్లో ఆధ్యాత్మిక రహస్యాలు, వేద సాహిత్యం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ పుస్తకాన్ని ఆర్డీవో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేద సాహిత్యం కోసం తెలుసుకోకపోతే జీవితం అగమ్యగోచరంగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గండి సింహాద్రి, ఓశాంతి భాస్కర రావు, శంకరం మాస్టార్ పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు



జస్టిస్ మన్మథరావుకు అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి.. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం, శేషవస్త్రాన్ని ఈవో అందించారు.

దువ్వాడ మీదుగా ఎర్నాకుళం స్పెషల్ రైలు

తాటిచెట్లపాలెం(విశాఖ):ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎర్నాకుళం-ధన్‌బాద్-ఎర్నాకుళం (వయా దువ్వాడ మీదుగా) మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. ఎర్నాకుళం-ధన్‌బాద్(06077) అన్‌రిజర్వ్‌డ్ స్పెషల్ రైలు ఈ నెల18, 25 తేదీల్లోఎర్నాకుళంలోఉదయం 7.15గంటలకు బయలుదేరుతుంది. మరుసటిరోజు మధ్యాహ్నం 12.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 12.10 గంటలకు బయల్దేరి తర్వాత రోజు ఉదయం 7.30 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. ధన్‌బాద్-ఎర్నాకుళం (06078) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ రైలు ఈ నెల 21, 28 తేదీల్లో రాత్రి 11.55 గంటలకు ధన్‌బాద్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 8.48 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 8.50 గంటలకు బయలుదేరి తర్వాత రోజు తెల్లవారు 2.30 గంటలకు ఎర్నాకుళం వెళ్తుంది. ఈస్పెషల్ అలువ, త్రిస్సూర్, పాలక్కడ్, పోదునూర్, త్రిపూర్, ఈరోడ్, సేలం, జాలర్‌పేట,కాట్పడి,అరక్కోణం,పెరంబూర్, గూడూరు, నెల్లూరు,ఒంగోలు, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ,విజయనగరం, బొబ్బిలి,పార్వతీపురం, రాయగడ, మునిగుడ, అంబోడల, కేసింగ, టిట్లాగడ్, బాలంగీర్, బార్‌గడ్ రోడ్, సంబల్‌పూర్, జార్సుగుడ, రాజ్‌గుస్‌పూర్, రూర్కెలా, నౌగావ్, హతి యా, రాంచీ, మురి, బొకారో స్టేషన్లలో ఆగుతుంది.

అందాల ఆవకు అధునాతన హంగులు

- కొండకర్ల ఆవను జాతీయ స్థాయి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు
- ఎకో టూరిజం, బోటు క్లబ్ ఏర్పాటుకు నిర్ణయం
- వాటర్ స్పోర్ట్స్, జెట్టీల అభివృద్ధికి కసరత్తు
- రూ.40 కోట్లు కేటాయించాలని సిఫారసు





కొండకర్ల ఆవ వద్ద ఏర్పాటు చేసిన పార్కు

అచ్యుతాపురం: జిల్లాలోని అచ్యుతాపురం-మునగపాక మండలాల సరిహద్దులో ఉన్న కొండకర్ల ఆవను జాతీయస్థాయిలో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆ దిశగా పర్యాటక శాఖ అడుగులు వేస్తోంది. దీని కోసం ఇప్పటికే ప్రణాళికలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. సుమారు రూ.35 కోట్ల నుంచి రూ.40 కోట్ల వ్యయంతో అధునాతన హంగులు, పర్యాటకులను ఆకర్షించే నిర్మాణాలను రూపొందిస్తోంది. సాంకేతిక పరమైన ప్రక్రియ పూర్తి అయిన వెంటనే నిధులు విడుదల కానున్నాయి. నిధులు వచ్చిన వెంటనే పనులను ప్రారంభించాలని పర్యాటక శాఖ భావిస్తోంది. సహజ వనరులతో, జీవ రాశులతో సమతుల్యంగా ఉండే ఈ ఆవ రాష్ట్రంలోనే రెండవ అతి పెద్ద మంచినీటి సరస్సు. ఆవ సరిహద్దుల్ని సంరక్షించేందుకుగానూ ఇప్పటికే ఐదుగురి కమిటీతో కూడిన చిత్తడి నేల పరిరక్షణ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. పర్యాటక, అటవీ, జలవనరుల, ఉద్యాన వన శాఖల ఉమ్మడి పర్యవేక్షణలో కొండకర్ల-వాడ్రాపల్లి ఆవకు సంబంధించి పలు ప్రతిపాదనలు సైతం పరిశీలనలో ఉన్నాయి.

అందాలకు నిలయం

1800 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొండకర్ల ఆవ సరిహద్దులో హరిపాలెం, కొండకర్ల, గొల్లలపాలెం, వాడ్రాపల్లి, మునగపాక, తిమ్మరాజుపేట గ్రామాలు, చుట్టూ మూడు కొండలున్నాయి. నిత్యం నీటితో కళకళలాడే ఆవలో సరిహద్దులోని భూములు చిత్తడిగా ఉంటాయి. స్థానిక గ్రామస్తులతో కమిటీ వేసి ఆ చిత్తడి భూముల్లో కొబ్బరి, ఇతర ఉద్యానవన పంటలను సాగు చేయాలని, తద్వారా ఆవకు వచ్చే పక్షుల విడిదికి ఆవాసం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సందర్శకులను కట్టిపడేసే ఎన్నో అందాలు ఈ ఆవలో దాగి ఉన్నాయి. ఆవలో కలువ, తామర పూల అందాలు, విదేశీ పక్షుల కిలకిలలు, పచ్చని సోయగాలు మైమరిపిస్తాయి. మూడు వైపులా ఉండే కొండలు చూస్తే మనసుకు ఎంతో ఉపశమనం లభిస్తుంది. కొండకర్ల ఆవలోని అందాలను వీక్షించాలనే వారి కోసం ప్రత్యేకమైన యాప్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ యాప్‌లో ఆవలోని ప్రత్యేకతలను పర్యాటకులు ఎక్కడినుంచైనా తెలుసుకోవచ్చు. రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆవ సరిహద్దుల్ని గుర్తించనున్నారు. చిత్తడి నేలల్లో పెంచే కొబ్బరి, అటవీ మొక్కలను సంరక్షిస్తూ అక్కడ పెరిగే సంపదను కాపాడటం, పక్షుల వివరాలను పర్యాటకులకు వివరించే గైడ్‌లుగా స్థానిక యువకులకు అవకాశం కల్పించడం వంటి రెండంచెల వ్యూహాలు ఉన్నాయి. ఆవలో ఉన్న శివలింగం, అరుదైన మొక్కలను చూసేందుకు పర్యాటకులు ఎంతో ఆసక్తి చూపుతారు. స్థానిక మత్స్యకారుల ఉపాధికి దెబ్బతగలకుండా చేపల పెంపకానికి, బోట్లను నడపడంలోనూ మత్స్యకారులకే అవకాశం కల్పించనున్నారు.

ఎకో టూరిజానికి ఏర్పాట్లు

కొండకర్ల ఆవను ఎకో టూరిజ కేంద్రంగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.ఇప్పటికే ఈ ప్రాంతానికి వచ్చే వాహనాలకు సరైన రహదారిని ఏర్పాటు చేశారు.పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలం కేటాయించారు.మరో వైపు ప్రైవేట్ రిసార్టులో అతిథులు ఉండేందుకు పలు వసతులు కల్పించారు.పిల్లలు ఆడుకునేందుకు పార్కుల్ని ఏర్పాటు చేశారు.

ప్రతిపాదనలు ఇలా..

- బోట్ క్లబ్
- వాటర్ వరల్డ్
- ఆవను ఆనుకొని ఉన్న కొండ వద్ద ఏడు ఎకరాల విస్తీర్ణంలో రిసార్టు నిర్మాణం
- పర్యాటకులు బోట్లు ఎక్కేందుకు అనువుగా మరిన్ని ఫ్లోటింగ్ జెట్టీలు
- పీపీపీ పద్ధతిలో ఏర్పాటుకు పర్యాటక శాఖ నిర్ణయం



బోటులో విహరిస్తున్న పర్యాటకులు

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు

కొండకర్ల ఆవను అభివృద్ధి చేసేందుకు పలు ప్రతిపాదనలు ఉన్నాయి. ఇప్పటికే ఈ ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపాం.కొండకర్ల ఆవను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయి. వాటర్ వరల్డ్, బోట్ క్లబ్,రిసార్టుతో పాటు ఇంకా చాలా ప్రతిపాదనలు ఉన్నాయి.

–మహేష్, ఎఫ్ఏసీ పర్యాటక శాఖ అధికారి

సాగులో నూతన పద్ధతుల ఆవిష్కరణకు కృషి

కృషి విజ్ఞాన కేంద్రాల సంచాలకులు డాక్టర్ మీరా



హరిపురం కేవీకేలో మాట్లాడుతున్న డాక్టర్ మీరా

రాంబిల్లి: నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడమేగాక భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా సాగులో నూతన పద్ధతుల ఆవిష్కరణకు కృషి చేయాలని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి(కృషి విజ్ఞాన కేంద్రాల సంచాలకులు, హైదరాబాద్) డాక్టర్ షేక్. ఎన్. మీరా అన్నారు. హరిపురం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ఆదివారం అభ్యుదయ రైతులతో చర్చా గోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మీరా మాట్లాడుతూ సాగు లాభదాయకంగా మారినప్పుడే రైతులు ఆర్థిక పరిపుష్టి సాధిస్తారని చెప్పారు. మన విత్తనాన్ని మనమే తయారు చేసుకోవడమేగాక ఎగుమతి చేసే విధంగా రైతులు మార్పు చెందాలని సూచించారు. గ్రామాలు విత్తన కేంద్రాలుగా మారాలని ఆకాంక్షించారు. మార్కెట్ ఆధారిత పంటలు సాగు చేయడమేగాక, అధిక ధర వచ్చేలా నూతన మార్కెటింగ్ వ్యవస్థలను రైతులు అలవర్చుకోవాలన్నారు. రైతులకు అవసరమైన సాంకేతికత, సూచనలు, సలహాలను కేవీకే శాస్త్రవేత్తల ద్వారా సమర్థంగా అందజేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పంటల సాగులో ఎదుర్కొంటున్న సమస్యలు, మార్కెటింగ్, కొత్త వంగడాలు తదితర అంశాలపై తమకున్న సందేహాలను మీరా దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం పలువురు రైతులకు మినుము, నువ్వు విత్తనాలతో పాటు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే చైర్మన్ బి. శ్రీరామ్మూర్తి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ, శాస్త్రవేత్తలు నాగేంద్రప్రసాద్, శ్రీహరి, వాన ప్రసాద్‌పాల్గొన్నారు.

యువగళం కృత్రిమ పాదయాత్ర

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను మరోసారి మోసగిస్తున్న టీడీపీ
- జగనన్న పాలనలో అన్ని వర్గాలకు సామాజిక న్యాయం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఏపీఐడబ్ల్యూ రాష్ట్ర చైర్మన్ దిలీప్‌కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్, దిలీప్‌కుమార్

అనకాపల్లి: రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలను చంద్రబాబు 14 సంవత్సరాల పాలనలో ఓటర్‌గానే వాడుకొని అధికారం చేపట్టిన తరువాత సొంత కమ్మవర్గానికి మాత్రమే పదవులు కట్టబెట్టిన రోజులు మర్చిపోయారా...? యువగళం పేరుతో మరోసారి మైనార్టీ వర్గాల ప్రజలను మోసం చేసేందుకు లోకేష్ పాదయాత్ర చేయడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సామాజిక న్యాయం జరిగిందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని సీఎం విశాఖ కేంద్రంగా పరిపాలనా రాజధానిగా అడుగులు వేస్తుంటే చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్‌లు అడ్డుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. బంగాళాఖాతంలో కలిసిపోయే టీడీపీకి తోకపార్టీ జనసేన మద్దతు పలకడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం చేస్తూ పెద్ద పదవులను ఇస్తున్నారని తెలిపారు. విశాఖ ఉమ్మడి జిల్లాలో గవర, యాదవ, వెలమ వర్గాలతో పాటు ఇతర వర్గాల వారు పెద్దపెద్ద పదవుల్లో ఉండడం చూసి టీడీపీ, జనసేన నేతలు ఓర్వలేకపోతున్నారన్నారు. ముద్రగడ పద్మనాభం కాపుల రిజర్వేషన్ కోసం పోరాటాలు చేస్తుంటే కాపులపై కేసులు పెట్టి రిజర్వేషన్ అడ్డుకున్న రోజులు చంద్రబాబుకు గుర్తులేదా అని ప్రశ్నించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతూ మరోసారి ముఖ్యమంత్రిగా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఏపీఐడబ్ల్యూఏ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ యువగళం పాదయాత్ర కృత్రిమ గళంగా ఉందన్నారు. పాదయాత్రలో జనం కంటే ఫ్లెక్సీ బోర్డులు ఎక్కువగా ఉన్నాయని, నిద్రిస్తున్న టీడీపీకి తోకపార్టీ జనసేన మద్దతు పలికినప్పటికీ యువగళంలో ప్రజలు స్పందించలేదన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, పార్టీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిసెట్టి రమణఅప్పారావు, కార్యదర్శి జాజుల రమేష్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పి.సురేష్, దేవస్థానాల చైర్మన్లు మురళీకృష్ణ, కె.ఎం.నాయుడు, నాగేశ్వరరావు, గోవిందరావు, మార్కెట్ యార్డు చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఎన్టీఆర్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మునూరు శ్రీనువాసరావు, అనకాపల్లి, కశింకోట పార్టీ అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాసోత్సవాలు ప్రారంభం

నక్కపల్లి/సింహాచలం: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయం, సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఆదివారం తెల్లవారు జామున ఘనంగా ప్రారంభమయ్యాయి. ధనుర్లగ్నం ప్రవేశం ప్రారంభ సూచకంగా రెండు ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, విశేష ప్రసాద నివేదనలు, నిత్యార్చనలు నిర్వహించారు. అనంతరం ఘంటానాదం చేయడంతో ధనుర్మాసోత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. గోదాదేవి అమ్మవారి వ్రతదీక్షలో భాగంగా తిరుప్పావైలోని మొదటి పాశురంతో ప్రత్యేక నీరాజనాలు స్వామివారికి సమర్పించారు. ఉపమాకలో కొండ దిగువన గల క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి సన్నిధిలోను, ఉపాలయాల్లోను ప్రత్యేక ప్రసాద నివేదనలు పూర్తిచేసి, స్వామివారి ఉత్సవ మూర్తులకు, గోదాదేవి అమ్మవారి సన్నిధిలో సేవాలకాలంలో నిర్వహించిన మొదటిపాశురం విన్నపంతో ప్రత్యేక నీరాజనాలు సమర్పించారు. గోదాదేవి అమ్మవారి వ్రత దీక్షలో భాగంగా ఆదివారం ఉదయం రెండో రోజు రెండవ పాశురంతో ప్రత్యేక నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ధనుర్మాస ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చక స్వాములు సంకర్షణ పల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి వెంకట శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలచార్యులు నండూరి రాజగోపాలాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు. సింహాచలంలో ముందుగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను, గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని, ఆళ్వారులను ఆస్థానమండపంలో వేదికపై అధిష్టింపజేశారు. ధనుర్మాస ప్రారంభ నివేదనం, తిరుప్పావై ప్రబంధ సేవాకాలం, ధను సంక్రమణ ప్రవేశ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారిని పల్లకీలో అధిష్టింపజేసి.. ఆలయ బేడామండపంలో ఘనంగా తిరువీధి నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో తొలి పాశుర విన్నపాన్ని పఠించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావురావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఉపమాక వెంకన్న సన్నిధిలో నెలగంట మోగిస్తున్న అర్చకులు



సింహగిరి రాజగోపురంలో నెలగంట మోగిస్తున్న సిబ్బంది

జూకు రూ. 6.84 లక్షల ఆదాయం

ఆరిలోవ(విశాఖ): జూ పార్కులో ఆదివారం సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో జూ పార్కును వేలమంది సందర్శించారు. దీంతో జూకి రూ.లక్షల్లో ఆదాయం లభించింది. జూని సందర్శించిన పిల్లలు, పెద్దలు, వన్యప్రాణులను తిలకించి, సరదాగా గడిపారు. జంతువులు, పక్షులు వాటి ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ సందర్శకులను అలరించాయి. ఆదివారం రెండు గేట్లు ద్వారా 8,550 మంది సందర్శించినట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. వారి ద్వారా రూ 6.84 లక్షలు ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

అద్దంలేని బస్సుతో హైదరాబాద్‌కు..

- కావేరి ట్రావెల్స్ నిర్వాకం
- రావాల్సిందేనంటూ డ్రైవర్, యాజమాన్యం ఒత్తిడి
- చలికి తట్టుకోలేక గజ గజలాడిన ప్రయాణికులు
- నక్కపల్లి పోలీస్ స్టేషన్ వద్ద బస్సు నిలుపుదల
- పోలీసులకు ఫిర్యాదు
- ప్రత్యామ్నాయ బస్సు ఏర్పాటు చేసేది లేదన్న యాజమాన్యం
- అర్ధరాత్రి చలిలో ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం



ముందు మిర్రర్ లేని కావేరీ ట్రావెల్స్‌బస్సు

నక్కపల్లి: ఛార్జీల రూపంలో వందలాది రూపాయలు వసూలు చేస్తూ సరైన కండిషన్ లేని బస్సు సమకూర్చారంటూ పలువురు ప్రయాణికులు నక్కపల్లి పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు విశాఖపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు టికెట్లు తీసుకున్నారు. ట్రావెల్స్ వారు కావేరీ ట్రావెల్స్ బస్సును ఏర్పాటు చేశారు. అయితే ఈ బస్సు కండిషన్‌లో లేదని, ముందు భాగంలో అద్దం లేదని ప్రయాణికులు తెలిపారు. చీకట్లో తాము అద్దం లేదనే విషయాన్ని గుర్తించలేదని, రన్నింగ్‌లో ముందు భాగం నుంచి విపరీతమైన చలిగాలులు రావడంతో డ్రైవర్ వద్దకు వెళ్లి పరిశీలించగా అద్దం లేని విషయం బయటపడిందన్నారు. దీంతో డ్రైవర్‌ను టికెట్స్ బుక్ చేసుకున్న ట్రావెల్ ఏజెన్సీ వారిని సంప్రదిస్తే సరైన సమాధానం చెప్పడం లేదన్నారు. చలిగాలులతో గజగజ వణుకుతున్న వీరంతా ఎట్టకేలకు నక్కపల్లి పోలీస్ స్టేషన్ వద్ద బస్సును బలవంతంగా నిలిపివేశారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. ఇదే బస్సులో హైదరాబాద్ తీసుకెళ్తామని, మీరంతా రావాల్సిందేనని డ్రైవర్, బస్సు యాజమాన్యం ఒత్తిడి తెస్తోందని ప్రయాణికులు తెలిపారు. ప్రయాణం చేయకపోతే టికెట్ డబ్బులు తర్వాత వాపసు చేస్తామని, ప్రత్యామ్నాయంగా వేరే బస్సు ఏర్పాటు చేసేది లేదని చెబుతున్నారని ప్రయాణికులంతా ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి 11 గంటల సమయంలో ప్రయాణికులంతా నక్కపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిటికీలకు అద్దాలు లేకపోవడం వల్ల రాత్రిపూట విపరీతమైన చలిగాలులు వీస్తున్నాయని, చలిగాలులతో గజగజ లాడుతున్నామంటూ ఆందోళన వ్యక్తం చేశారు.



నక్కపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద బస్సు నిలిపి ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

హుషారుగా నూర్పులు

- ఆశాజనకంగా వరి దిగుబడి
- తుపాను ముంపు నుంచి తేరుకున్న అన్నదాతలు
- వరి కోతలు, నూర్పులతో బిజీ
- కూలీలు, యంత్రాల కొరత



యంత్రంతో వరి నూర్పు చేస్తున్న రైతులు

చోడవరం: తుపాను ముంపు నుంచి బయటపడిన రైతులు ఇప్పుడు వరి కోతలు, నూర్పులతో బిజీ అయ్యారు. ఆశించిన దానికంటే ఎక్కువగా పంట దిగుబడి రావడంతో సంక్రాంతి పండగ ముందే వచ్చిందన్నంత ఆనందంలో ఉన్నారు. కోతల సమయంలో తుపాను వర్షాల వల్ల కొన్ని గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో కొంతమేర నష్టం వాటిల్లినా, మిగతా చోట్ల పంట బాగా పండింది. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో 35 నుంచి 40 బస్తాల దిగుబడి రావడంతో రైతన్నలు ముఖంలో ఆనందం వెల్లివిరుస్తోంది. గోదావరి జిల్లాల్లో మాదిరిగానే మన జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఈ ఏడాది వరి దిగుబడి రానుందని ప్రస్తుతం నూర్పుల్లో వస్తున్న ధాన్యం దిగుబడి బట్టీ తెలుస్తోంది. పాయకరావుపేట, యలమంచిలి, నర్సీపట్నం, అనకాపల్లి నియోజకవర్గాల్లో 25 నుంచి 30 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 1.55 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. చోడవరం, బుచ్చెయ్యపేట, మాడుగుల, రావికమతం, దేవరాపల్లి, చీడికాడ, కె.కోటపాడు, రోలుగుంట మండలాల్లో 60 వేల ఎకరాల్లో వరి సాగైంది. ప్రస్తుతం ఆఖరులో పంటవేసినవారు కోతలు కోసి కుప్పలు పెడుతుండగా, ముందుగా కోసిన వారు నూర్పులు చేస్తున్నారు. ఆశాజనకంగా పండిన పంటను చూసి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలా చోట్ల ధాన్యం నూర్పుల్లో బిజీబిజీగా ఉన్నారు.



దిగుబడి వచ్చిన ధాన్యం బస్తాలు

వేధిస్తున్న కూలీల కొరత

ఒకే సారి అందరూ వరి కోతలు, నూర్పులు చేస్తుండడంతో కూలీలు, యంత్రాల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. కూలి రేట్లు అమాంతంగా పెరగడంతోపాటు కూలీల కొరత ఏర్పడింది. ట్రాక్టర్ల, కూలీలు, గాలిపోత మిషన్లు, వరి నూర్పు యంత్రాలకు మంచి డిమాండ్‌వచ్చింది. ఎకరా పంటను నూర్చేందుకు రూ.4 వేలు వరకు ఖర్చవుతోంది. పాత పద్ధతిలో నూర్పులు చేస్తే ఖర్చు ఎక్కువ తుండడం వల్ల వరి నూర్పు యంత్రాలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. అయితే చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో ఎనిమిది యంత్రాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో ముందుగా బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిషన్ దొరకని వారు ఎడ్లు, ట్రాక్టర్లతో నూర్పులు చేసి గాలిపోత మిషన్లతో ధాన్యం వడపోస్తున్నారు. మరికొందరు సాధారణ ఫ్యాన్లను వినియోగించి గాలిపోత చేస్తున్నారు. మళ్లీ తుపాను హెచ్చరికలు వస్తాయేమోనన్న ఆందోళనతో అంతా ఒకే సారి నూర్పులు చేస్తుండటంతో కోతలు, నూర్పులతో గ్రామాలన్నీ సందడిగా ఉన్నాయి.

క్లుప్తంగా

కొత్తకోటలో రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



కొత్తకోటలో రోడ్డు విస్తరణ పనుల పరిశీలిస్తున్న విప్ కరణం ధర్మశ్రీ

రావికమతం: మండలంలోని కొత్తకోటలో రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను స్థానిక నాయకులతో కలసి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాణ్యతలో రాజీ పడకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులందరూ పాల్గొన్నారు.

నలుగురిపై తూనికలు, కొలతల శాఖ కేసులు



చేపల దుకాణాలను తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ

నర్సీపట్నం: మండలంలోని పెదబొడ్డేపల్లి చేపలు, మాంసం దుకాణాలపై తునికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ డి.అనురాధ, తన సిబ్బందితో కలిసి ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ తూకం తూస్తున్న ఇద్దరు చేపల వ్యాపారులపైనా కాటాలకు సీళ్లు వేయించని మరో ఇద్దరిపైనా కేసులు నమోదు చేశారు. మాంసం, చేపలు కొనుగోలు చేసిన వారికి తిరిగి తూకం వేయించి అప్పగించారు. తూకంలో మోసాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఇన్‌స్పెక్టర్ వ్యాపారులను హెచ్చరించారు.

కనుజు హడావుడి



ఆరిలోవ: దట్టమైన అడవుల్లో తిరగాల్సిన వన్య ప్రాణులు ఆహారం కోసం జనారణ్యంలోకి వచ్చేస్తున్నాయి. ఆదివారం సీతకొండ నుంచి ఓ కనుజు బయటకు వచ్చింది. కొండ పైనుంచి కిందకు దిగి జూ సమీపంలో బీచ్ రోడ్డు వైపు హడావుడి చేసింది. రోడ్డు పక్కన పచ్చిక మేస్తుండగా విశాలాక్షినగర్ నుంచి సాగర్‌నగర్ వైపు వెళ్లే ప్రయాణికులు గుంపులుగా చేరారు. వారిని చూసి చెంగుచెంగున గెంతులు వేస్తూ మళ్లీ కొండపైకి వెళ్లిపోయింది.

ఉల్లాసంగా వైజాగ్ మారథాన్



ఆర్కే బీచ్ వద్ద రన్‌లో వేలాది మంది పాల్గొన్న రన్నర్స్



రన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు



ప్లకార్డులతో విద్యుత్తు శాఖ అధికారులు

- వేల సంఖ్యలో పాల్గొన్న రన్నర్స్
- విజేతలకు నగదు బహుమతులు



బీచ్‌రోడ్డు: వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంధ్య మెరైన్స్ వైజాగ్ మారథాన్ ఉల్లాసంగా సాగింది. 21కె.10కె, 5కె , 3కె నాలుగు విభాగాల్లో నిర్వహించిన ఈ మారథాన్‌లో సుమారు 7 వేల మంది రన్నర్స్ పాల్గొన్నారు. కేవలం మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా రన్నర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎంతో ఉల్లాసంగా మారథాన్ చేశారు. దీంతో సాగరతీరంలో సందడి వాతావరణం నెలకుంది. ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు సాగిన ఈ మారథాన్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లను చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు బాలకృష్ణారాయ్ మాట్లాడుతు వయోభేదం లేకుండా వేల సంఖ్యలో ఔత్సాహికులు పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండేందుకు, విశాఖ నగరం ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించి పర్యావరణాన్ని కాపాడడంపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంధ్య మెరైన్స్ డైరెక్టర్ ఆనంద్, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్, యూనియన్ బ్యాంక్ డీజీఏ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు..

విజేతలు వీరే..

21కే పురుషుల విభాగంలో ఆర్.ఆర్.నాయక్, మహిళ విభాగంలో సౌమ్య సరస్వతి గెలిపొందారు. వీరికి నిర్వాహకులు రూ.40 వేలు, మెడల్, ట్రోఫీని అందజేశారు. రెండు మూడు స్థానాల్లో గెలుపొందిన వారికి రూ.30వేలు, రూ.20 వేలు అందజేశారు.అలాగే 10 కేలో పురుషుల విభాగంలో హరీష్, మహిళల విభాగంలో గ్రేస్ విజేతలుగా నిలిచారు. వీరికి రూ.15 వేలు, మెడల్, ట్రోఫీని అందజేశారు. రెండు, మూడు స్థానాల్లో వచ్చిన వారికి రూ.10వేలు రూ.7,500 అందజేశారు. వీరితో పాటు వివిధ విభాగాల్లో విజేతలను ప్రకటించి మొత్తం రూ. 5లక్షల విలువగల బహుమతులను అందజేశారు.

విద్యుత్ ఆదా చేయండి

మారథాన్‌లో విద్యుత్ ఆదాపై ఆ శాఖాధికారులు అవగాహన కల్పించారు. మారథాన్‌లో ప్లకార్డులను ప్రదర్శించారు.

ఆకట్టుకున్న 'ఇంద్రప్రస్థ' నాటకం

- నాటక రంగ అభివృద్ధికి సాంబశివరావు సేవలు ప్రశంసనీయం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



నాటక రంగ దర్శకుడు సాంబశివరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వక్తలు

మునగపాక: స్థానిక నందీశ్వర తులసీ కళా వేదికపై ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఇంద్రప్రస్థ నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. నాటకంలోని నటీనటులు తమ పాత్రలకు జీవం పోస్తూ కళ్లకు కట్టినట్టు అద్భుతంగా నటించారు. ఈ నాటకానికి గోపీ సత్యప్రకాష్ రచన చేయగా, ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు. నాటక రంగ దర్శకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు మొతికా సాంబశివరావు వర్ధంతి సందర్భంగా నందీశ్వరా నాట్య మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాటక ప్రదర్శనను తిలకించేందుకు కళాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ ప్రదర్శనను వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ప్రారంభించారు. ముందుగా సాంబశివరావు చిత్రపటానికి పలువురు వక్తలతో కలిసి నివాళులర్పించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ సాంబశివరావు ఎంతోమందిని కళాకారులుగా తీర్చిదిద్దారని, తన వద్ద విద్యాబుద్ధులు నేర్చిన వారంతా ఉన్నత స్థానాలను అధిరోహించారన్నారు. మునగపాక ఎంపీటీసీ సూరిశెట్టి రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, కళాకారులు కాండ్రేగుల జగ్గారావు, దాడి ముసిలినాయుడు, టెక్కలి సూరప్పారావు, పీఏసీఏస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు, సాంబశివరావు మాస్టారు కుమారులు సన్యాసిరావు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కళాఉత్సవ్ పోటీల్లో కాశీపురం విద్యార్థిని ప్రతిభ



తృతీయ బహుమతిని అందుకుంటున్న బాలిబోయిన వరలక్ష్మి

దేవరాపల్లి: రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినికి తృతీయ బహుమతి లభించింది. ఈ నెల 14,15 తేదీల్లో అమరావతిలో జరిగిన రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ పోటీల్లో సంప్రదాయ ఆట బొమ్మల తయారీలో కాశీపురం హైస్కూల్‌కు చెందిన బాలిబోయిన వరలక్ష్మి తృతీయ స్థానాన్ని సాధించింది. రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు సంచాలకులు శ్రీనివాసరావు, విద్యా పరిశోధన మండలి సంచాలకులు ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వరలక్ష్మిని స్థానిక హెచ్ఎం పి.బి.టి.సుందరి, సర్పంచ్ ఎ.వరలక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సీహెచ్. సూర్యనారాయణ, ఉపాధ్యాయుడు కొట్టాన రాంబాబు తదితరులు అభినందించారు.

వెలమ సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

24న జరిగే వనసమారాధనకు డిప్యూటీ సీఎంకు ఆహ్వానం



వెలమ సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: గ్రేటర్ విశాఖ వెలమ సంక్షేమ సంఘం నూతన సంవత్సర(2024) క్యాలెండర్‌ను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం ఆవిష్కరించారు. ఈ మేరకు తారువ క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎంను వెలమ సంక్షేమ సంఘం నేతలు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షుడు చలుమూరి నాయుడు బాబు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ నెల 24న జరగనున్న వెలమ సంక్షేమ సంఘం వనసమారాధనకు హాజరు కావాలని సంఘ నేతలు సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు సూరెడ్డి సత్యనారాయణ, ద్వారపురెడ్డి కృష్ణ, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రటరీ మడక ఈశ్వరరావు, డా. రంధి రామునాయుడు తదితర్లు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందిన సీఐ తాతారావుకు సన్మానం



తాతారావును దుశ్శాలువాతో సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

కె.కోటపాడు: విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేస్తే ఉన్నతాధికారుల మన్ననలను పొందుతారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. కె.కోటపాడు సీఐ ఎస్.తాతారావు డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయనకు సిబ్బంది సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఇక్కడ సర్కిల్ కార్యాలయానికి మొదటి సీఐగా పని చేసి నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు విశేష కృషి చేశారన్నారు. అనంతరం తాతారావుకు పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ మాడుగుల మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, ఎస్ఐలు ఆర్.ధనుంజర్, బి.రామకృష్ణ, నాగేంద్ర, రామారావు, దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

'ఏపీ జేఏసీ అమరావతి' మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్‌గా వీరావాణి



నూతన కార్యవర్గంతో రాష్ట్ర మహిళా విభాగం నాయికులు

అనకాపల్లి: ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్‌గా జి.వీరావాణి(రెవెన్యూ) ఎన్నికయ్యారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్.సుజాత, కో చైర్‌పర్సన్లుగా బి.ఉషారాణి, డి.పి.ఎస్.నళిని, కె.సత్యవతి, వి.సత్యవతి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొమ్మరపల్లి లక్ష్మి(ఆర్టీసీ), కార్యదర్శులుగా ఎస్.రామలక్ష్మి, ఎ.రమణమ్మ, సీహెచ్.గౌరీ, టి.ఎ.లక్ష్మి, కోశాధికారిగా జి.రామసుశీల ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఏపీ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.వి.ఎస్. నాయుడు, ప్రధాన కార్యదర్శి లోవరాజు, రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ పారే లక్ష్మి, ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి, అసోసియేట్ చైర్మన్ సైకం శివకుమారిరెడ్డి, కోశాధికారి జి.పావని, జిల్లా కోశాధికారి శ్రీరాంమూర్తి పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల గంజాయి తరలిస్తున్న ఏడుగురి అరెస్టు

నర్సీపట్నం: గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను నర్సీపట్నం ఎస్ఈబీ పోలీసులు అరెస్టు చేశారని సీఐ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. సీఐ వివరాల మేరకు... ముందుస్తుగా అందిన సమాచారం మేరకు ఎస్సై చంద్రశేఖర్, సిబ్బందితో కలిసి నెల్లిమెట్ట వద్ద తనిఖీలు చేశారు. అక్కడ బైకుపై వస్తున్న నిందితుడిని తనిఖీ చేయడంతో 14 కిలోల గంజాయి దొరికింది. అతడిది మాకవరపాలెం మండలం సీతాన అగ్రహారానికి చెందిన పల్లా నాగరాజుగా విచారణలో అంగీకరించాడు. దీన్ని పాయకరావుపేటలో ఉంటున్న బాషాకు అప్పగించేందుకు తీసుకెళ్తుట్టు చెప్పాడు. ఆ మేరకు బాషాను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి అమ్మిన జి.మాడుగుల మండలం వంజరి పంచాయతీ శివారు గేదెల బందకు చెందిన ఎం.నాగేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

రోలుగుంట: మండలంలో గంజాయి వ్యాపారులపై ఆదివారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో మొకాస కొత్తపట్నంలో మరిడిమాంబ గుడి వద్ద నలుగురు యువకులు అనుమానాస్పదంగా పట్టుబడ్డారు. వారి నుంచి రెండు బైకులు, పది కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎల్ సురేష్ వివరాల ప్రకారం... తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఓ వ్యక్తి నర్సీపట్నంలో పదేళ్లుగా ఉంటున్నాడు. అతడు ఏజెన్సీ నుంచి వచ్చే గంజాయి స్మగ్లర్లతో సంబంధం ఏర్పరుచుకుని తమిళనాడు, తదితర ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి గంజాయి విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో తనతోపాటు మరో వ్యక్తిని వెంటబెట్టుకుని చింతపల్లికి చెందిన వ్యక్తితో కలిసి రెండు బైకులపై పది కిలోల గంజాయి తీసుకొచ్చి తమిళనాడుకు చెందిన వ్యక్తికి అప్పగిస్తూ పట్టుబడ్డారు. గంజాయి స్వాధీనం చేసుకుని, వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

కోస్టల్ సెక్యూరిటీ ఎస్పీగా రజని



ఎస్పీ రజనికి శుభాకాంక్షలు తెలుపుతున్న అడిషనల్ ఎస్పీ మధుసూదనరావు

కొమ్మాది: ఆంధ్రప్రదేశ్ కోస్టల్ సెక్యూరిటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా రజని ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె తూర్పు గోదావరి లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీగా పనిచేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ జీవీఆర్ మధుసూదనరావు, పోర్టు, రుషికొండ కోస్టల్ సెక్యూరిటీ సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి.. శుభాకాంక్షలు తెలిపారు.

కళ్ల ముందే కనుమూసిన అర్ధాంగి

- బైక్ రూపంలో వెంబడించిన మత్యువు
- కొత్తూరు వద్ద రోడ్డు ప్రమాదంలో గృహిణి దుర్మరణం

యలమంచిలి రూరల్: కంటికి రెప్పలా, తనలో సగభాగంగా చూసుకున్న తన అర్ధాంగి కళ్లముందటే ప్రమాదానికి గురై కనుమూయడాన్ని ఆమె భర్త జీర్ణించుకోలేకపోయారు. జీవితాంతం తోడుగా వుంటుందనుకున్న ఇల్లాలు తనను ఒంటరివాడిని చేసి అందనంత దూరాలకు వెళ్లిపోవడంతో అతను షాక్‌కు గురయ్యాడు. ఇంకా కొన ఊపిరి వుందేమోనన్న ఆశ, ఆత్రుతతో తన భార్యను ఆస్పత్రికి తీసుకొచ్చినప్పటికీ ఆమెకు శ్వాస లేదని వైద్యులు చెప్పడంతో ఆయన నిర్ఘాంతపోయాడు. శనివారం రాత్రి రాంబిల్లి మండలం కొత్తూరు వద్ద రోడ్డు ప్రమాదంలో గొలుగొండ మండలం జోగుంపేటకు చెందిన రాయవరపు పద్మ రాజ్యలక్ష్మి (44) మృతి చెందినట్టు దర్యాప్తులో తేలిందని ఆదివారం రాత్రి యలమంచిలి సీఐ షేక్ గఫూర్ చెప్పారు. వివరాల్లోకి వెళితే..

గొలుగొండ మండలం జోగుంపేటకు చెందిన రాయవరపు జోగేంద్ర,అతని భార్య పద్మ రాజ్యలక్ష్మి నాతవరం మండలం తాండవ వద్ద ఎరువుల దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. శనివారం అచ్యుతాపురంలో ఉంటున్న స్నేహితుడి ఇంటికి బైక్‌పై వెళ్లారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో తాండవ వెళ్తుండగా, వీరు ప్రయాణిస్తున్న బైక్ రాంబిల్లి మండలం కొత్తూరు వద్ద సెల్ఫ్ యాక్సిడెంట్‌కు గురైంది. బైక్‌పై నుంచి ఆమె తూళిపడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అయితే ఇంకా ఊపిరివుందన్న ఆశతో ఆమె భర్త జోగేంద్ర స్థానికుల సాయంతో యలమంచిలి ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. కాని అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. తాను నడుపుతున్న బైకే మృత్యు వాహనంగా తన అర్ధాంగిని కబళించడాన్ని జోగేంద్ర తట్టుకోలేకపోతున్నారు.మత్యువు బైక్ రూపంలో తన భార్యను కబళించిందని కన్నీరుమున్నీరవుతున్నారు. నిర్జీవంగా వున్న రాజ్యలక్ష్మి మృతదేహం వద్ద గుండెలవిసేలా రోధించారు. యలమంచిలి ఆస్పత్రి మార్చురీలో పద్మ రాజ్యలక్ష్మి మృతదేహానికి ఆదివారం పోస్ట్‌మార్టమ్ నిర్వహించారు. ఆమె ఎడమపాదానికి , మెడ భాగంలో తీవ్రగాయాలయ్యాయని, మెడ భాగంలో ఎముకలు విరిగిపోవడం వల్ల రోడ్డు ప్రమాదం కారణంగానే ఆమె మృతి చెందినట్టు పోస్ట్‌మార్టమ్ నిర్వహించిన వైద్యుడు డాక్టర్ సుభాష్ చెప్పారు. పోస్ట్‌మార్టమ్ అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు రాంబిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండో రోజూ కానరాని స్పందన

చప్పగా సాగిన లోకేష్ పాదయాత్ర



తోటాడ జంక్షన్‌లో లోకేష్ కోసం అంతంతమాత్రంగానే వేచి ఉన్న జనం

మునగపాక: సేమ్ టూ సేమ్.. మునగపాక మండలంలో రెండు రోజుల పాటు లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్ర చప్పగా సాగింది. ప్రజలకు భరోసా కల్పించేందుకు చేపట్టిన పాదయాత్రకు ఆశించిన మేర స్పందన లేకపోవడంతో తెలుగు తమ్ముళ్లు నైరాశ్యానికి గురయ్యారు. మండలంలో మొదటి రోజు పర్యటించిన లోకేష్‌ను చూసేందుకు అక్కడక్కడా రోడ్లపైకి వచ్చిన జనం రెండో రోజు ముఖం చాటేశారు. కొంతమంది తెలుగు తమ్ముళ్లు గ్రామాల నుంచి జనాలను ఆటోల్లో తరలించినా ఒరిగిందేమీ లేదంటూ విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన జన సైనికులు, యువగళం టీమ్ సభ్యులే హడావడి చేశారు. స్థానిక టీడీపీ శ్రేణుల భాగస్వామ్యం అంతంత మాత్రంగానే కనిపించింది. మండలంలో పాదయాత్ర పూర్తయ్యే వరకు లోకేష్ వెంట టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నేతలు ప్రగడ నాగేశ్వరరావు, సుందరపు విజయకుమార్ నడిచారు. సీటు ఎవరికి వస్తుందో తెలియని పరిస్థితుల్లో వీరిద్దరూ జన సమీకరణ చేయడంలో అంతగా ఆసక్తి చూపలేదన్న ఆరోపణలు లేకపోలేదు. ఉదయం 8 గంటలకు షెడ్యూల్ ఉన్నప్పటికీ జనాలు లేకపోవడంతో పది గంటల వరకు యాత్ర ప్రారంభం కాలేదు.

క్లుప్తంగా

'వై ఏపీ నీడ్స్ జగన్' నేడు

అనకాపల్లి: జీవీఎంసీ విలీనగ్రామం సిరసపల్లి, మండలంలోని వెంకుపాలెం సచివాలయం పరిధిలో సోమవారం మధ్యాహ్నం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవిందలు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ లబ్ధి వివరాల డిస్‌ప్లే బోర్డు, ప్రధాన కూడలిలో పార్టీ జెండా ఆవిష్కరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వలంటీర్లు హాజరు కావాల్సిందిగా కోరారు.

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం-2 సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వీవీ రవికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత నాలుగున్నరేళ్లలో సచివాలయ పరిధిలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ వివరాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేయనున్నట్లు పేర్కొన్నారు.

నూకాంబిక అమ్మవారి నగర సంకీర్తన



అమ్మవారిని పురవీధుల్లో ఊరేగిస్తున్న పోతురాజు సిండికేట్ సభ్యులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం పోతురాజు సిండికేట్ వారి ఆధ్వర్యంలో నూకాంబిక అమ్మవారి నగర సంకీర్తన ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ పాల్గొని అమ్మవారిని గవరపాలెం పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాసం నెల రోజులు అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం తెల్లవారు జాము 5 నుంచి 7 గంటల వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పీలా లక్ష్మీశ్రీనివాసరావు, పోతురాజు సిండికేట్ వ్యవస్థాపకులు ఉమామహేశ్వరరావు, దేవాలయం అర్చకులు సందీప్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

'దూరప్రాంత బస్సులు కాంప్లెక్స్ మీదుగా రావాలి'

అనకాపల్లి: విశాఖ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులను జిల్లా ప్రధాన కేంద్రం అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని సర్వేజనా ఐక్యవేదిక వ్యవస్థాపకుడు కోరిబిల్లి పరి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. విశాఖ నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, విజయవాడ, హైదరాబాద్, తిరుపతి, నెల్లూరు, ఏలూరు, చెన్నై తదితర దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు పూడిమడక జాతీయ రహదారిపై నుంచి వెళ్లిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాత్రి 9 గంటల తర్వాత ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోందన్నారు. ప్రయాణికుల ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు దూరప్రాంత బస్సులను అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అనకాపల్లి సినిమాలు

జోరుగా హుషారుగా: రాజా	
ఎక్స్‌ట్రా	: సత్యనారాయణస్క్రీన్-1
-------	: సత్యనారాయణస్క్రీన్-2
యానిమల్	: షిర్డిసాయి
హాయ్ నాన్న	: పర్తిసాయి
మంగళవారం	: వెంకటేశ్వర
తికమక తాండ	: శ్రీసత్య
పిండం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 13 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-3 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-5 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 258 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 194 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



నా పేరు రాజు. నర్సింగరావుపేట మా నివాసం. టైలరింగ్ షాపు నడుపుతున్నాను. గతంలో పండగలు, శుభకార్యాల సమయంలో బాగా బిజీగా ఉండేది. సంక్రాంతి రోజుల్లో అయితే సమయానికి తిండీతిప్పలు ఉండేవి కాదు. అంత బిజీగా పని ఉండేది. రెడీమేడ్ దుస్తులు వచ్చాక మా బతుకులు చాలా భారమయ్యాయి. ఈ పని తప్ప వేరే పని తెలీదు. మాలాంటి వృత్తులపై కూడా ప్రభుత్వాలు ఆలోచిస్తాయని అనుకోలేదు. జగన్ ప్రభుత్వం వచ్చాక టైలరింగ్ మెటీరియల్, కొత్త మిషన్లు కొనుగోలుకు కాస్త సాయపడేలా జగనన్న చేదోడు పథకం అమలు చేశారు. ఈ డబ్బులతో కాస్త ధైర్యం వచ్చి, కొత్త టెక్నాలజీ(ఎంబ్రాయిడరీ) మిషన్‌ను కొనుక్కున్నా. గతంలో చీరలు, ఇతర దుస్తులపై కొన్ని వర్కులకు వేరే వారి దగ్గరికి పంపాల్సి వచ్చేది. ఇపుడు నేను కొనుక్కున్న మిషన్‌తోనే అవి చేసుకోగలుగుతున్నా. సీఎం జగన్ ఇచ్చిన ధైర్యానికి కృతజ్ఞతలు.

> మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక పరికరాలు సమకూర్చుకోలేక.. పాత పరికరాలతో కులవృత్తిలో ముందుకు సాగలేక.. వేరే పనిచేయలేక... అవస్థలు పడుతున్న వేళ.. చేతి వృత్తిదారులకు జగనన్న చేదోడు పథకం భరోసానిచ్చింది. ఏటా రూ.10 వేల ఆర్థిక సాయంతో ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. తమకు చేతనైన వృత్తి పనితో బతుకుపై భరోసా పెంచుకున్నారు. తమకు అండగా నిలిచిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు చెప్తున్నారు.



జగనన్న చేదోడు డబ్బులతో కొనుగోలు చేసిన ఇస్త్రీ పెట్టెతో రజకవీధిలో ఇస్త్రీ చేస్తున్న నూకరత్నం

వెతలు తీరాయి.. బతుకులు మారాయి

- జగనన్న చేదోడుతో సాఫీగా కుల వృత్తి
- ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్న నాయీ బ్రాహ్మణులు, రజకులు, దర్జీలు



అనకాపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న చేదోడు పథకంతో చేతివృత్తులవారికి మేలు చేకూరింది. నాయీబ్రాహ్మణులు, రజకులు, దర్జీలకు ఏడాదికి రూ.10వేల చొప్పున అందిస్తూ వారికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. ఈ మొత్తాన్ని వారి వృత్తికి సంబంధించి వస్తుల కొనుగోలు, షాపుల అద్దె, విద్యుత్ బిల్లుల చెల్లింపులకు ఉపయోగించుకుంటున్నారు. ప్రభుత్వం ఇస్తున్న భరోసాతో చిన్నచిన్న బడ్డీలలో కాలం వెళ్లదీస్తున్న నాయీబ్రాహ్మణులు మారుతున్న కాలానికి అనుగుణంగా పెద్ద షాపులను అద్దెకు తీసుకుని కొత్త సామగ్రితో తమ వృత్తిని కొనసాగిస్తున్నారు. రజకులు తమ వద్ద ఉన్న పాత ఇస్త్రీ పెట్టెలను పక్కన పడేసి జగనన్న అందించిన చేదోడు నిధులతో నూతన ఇస్త్రీ పెట్టెలు కొనుగోలు చేయడంతోపాటు డ్రై క్లీనింగ్ సెంటర్లు ఏర్పాటుచేసి వ్యాపారాలకు నాంది పలుకుతున్నారు. దర్జీలు రడీమేడ్ వస్త్రాలకు తగ్గట్లుగా ఎంబ్రాయిడరీ మెషీన్లను కొనుక్కుని కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నారు.

చేదోడుతో వ్యాపారాభివృద్ధి



జగనన్న అందిస్తున్న ఆర్థిక సాయంతో నా వ్యాపారం మరింత అభివృద్ధి చెందింది. నాలుగేళ్లుగా వరుసగా రూ.10 వేల చొప్పున నా ఖాతాలో రూ.40 వేలు జమ అయింది. వాటితో కొత్త మిషన్ కొనుగోలు చేసుకున్నా. యువతకు నచ్చేలా ఫ్యాంట్లు, షర్టులు వేగంగా కుట్టి, అందించగలుగుతున్నా. ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి, మాకు అందిస్తున్న సాయానికి నేను నా కుటుంబం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి సదా రుణపడి ఉంటాం.

–ఎం.సాయి, దర్జీ, శాఖవీధి

అనకాపల్లి జోన్‌లో చేదోడు లబ్ధి వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	నగదు లబ్ధి
2019-20	238	రూ.23.80 లక్షలు
2020-21	372	రూ.37.20 లక్షలు
2021-22	379	రూ.37.90 లక్షలు
2023-24	481	రూ.48.10 లక్షలు

పరికరాలు సమకూర్చుకున్నా



వంశపారంపర్యంగా వస్తున్న క్షుర కుల వృత్తినే చేసుకుంటున్నా. చాలా కాలం నుంచి చిన్నబడ్డీలోనే సెలూన్ నిర్వహించాను. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న చేదోడు పథకం నాలో కాస్త ధైర్యాన్ని పెంచింది. నాలుగేళ్లలో జగనన్న ఇచ్చిన డబ్బులతోపాటు, మరి కొంత సమకూర్చుకుని షాపును విస్తరించాను. పలు రకాల డ్రై మిషన్లు, కత్తెరలు, ట్రిమ్మర్లు కొనుక్కున్నా. ఇపుడు రోజుకు రూ.వెయ్యి సంపాదిస్తున్నాను. జగనన్నకు కృతజ్ఞతలు.

–అన్నవరపు భాస్కర్, నాయీబ్రాహ్మణుడు, రింగ్‌రోడ్డు

నిత్యం వ్యాయామంతో ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నాయుడు

అనకాపల్లి: మారుతున్న ఆహారపు అలవాట్ల కారణంగా ప్రజలు వివిధ రకాలైన వ్యాధుల బారిన పడుతున్నారని, నిత్యం వ్యాయామంతో ఆరోగ్యంగా జీవించవచ్చని వెంకటేశ్వర నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ డీడీ నాయుడు అన్నారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నెహ్రూచౌక్ నుంచి వేల్పులవీధి, పెరుగుబజార్, రింగ్‌రోడ్డు, రైల్వే స్టేషన్ రహదారి, రామచంద్ర థియేటర్ మీదుగా జార్జిక్లబ్ వరకూ లాంగ్ వాక్ చేపట్టి, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాలైన వ్యాధులు మానవుని శరీరంలోనికి ఏవిధంగా వ్యాపిస్తాయి, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రతలను వివరించారు. ఏడాదికి రెండు సార్లు బీపీ సుగర్, రక్తపరీక్షలు చేసుకుంటే వ్యాధులను మొదటి దశలోనే నిర్మూలించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. రహదారులపై ఫాస్ట్‌ఫుడ్‌ను పూర్తిగా నిషేధించాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు యల్లపు శివ, కార్యదర్శి ఆర్.నారాయణరావు, కోశాధికారి డాక్టర్ విష్ణుమూర్తి, సీనియర్ సభ్యులు కేవీ గౌరీపతి, నల్లల దేముళ్లు, చవితిన నర్సింగరావు, ఆడారి మల్లికార్జునరావు, వీరభద్రరావు, కాండ్రేగుల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే రక్తదానం చేయాలి'



కొణతాల హరనాథ్‌బాబు

అనకాపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోజురోజుకూ రక్త నిల్వలు తగ్గిపోతున్నాయని, యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొణతాల హరనాథ్ బాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పరిధిలో రోజురోజుకూ ప్రైవేట్ రక్త నిల్వల కేంద్రాలు పుట్టుకొస్తున్నాయని, రక్త దానం చేసే వ్యక్తులు అక్కడికే ఎక్కువగా వెళ్తున్నారని తెలిపారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర పరిస్థితిలో రోగులు రక్తం కోసం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రక్తాన్ని అధిక ధరలకు అమ్ముకుంటున్న సంస్థలపైన, వ్యక్తులపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పెన్షనర్లకు 'డీఎస్ నకరా' చిరస్మరణీయుడు



డీఎస్ నకరా చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పిస్తున్న జగన్నాథరావు, సుభాషిణి

తుమ్మపాల: ప్రభుత్వ ఉద్యోగులు పింఛను ద్వారా ఉద్యోగానంతరం కూడా సమాజంలో గౌరవంగా జీవించేందుకు కారణం స్వర్గీయ డీఎస్ నకరా అని పింఛనుదారుల సంఘం అధ్యక్షుడు వి.జగన్నాథరావు అన్నారు. పట్టణంలోని నర్సింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ పింఛనుదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులందరూ నకరాకి ఎంతో రుణపడి ఉండాలన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అనకాపల్లి జిల్లా ట్రెజరీ అధికారి వి.ఎల్.సుభాషిణి మాట్లాడుతూ పింఛనుదారులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. పెన్షనర్లు జనవరి 1 నుంచి ఫిబ్రవరి 29లోగా లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని చెప్పారు. అనారోగ్యంతో ఎవరైనా బాధపడుతూ ఉంటే వారి వద్దకు తమ సిబ్బందిని పంపిస్తామని, వారు ఇంటి వద్దే లైఫ్ సర్టిఫికెట్స్ సమర్పించుకోవచ్చన్నారు. సంఘ కార్యదర్శి బీఎల్ఎస్ శర్మ మాట్లాడుతూ పెన్షన్ కోసం నకరా సాగించిన పోరాటం గురించి తెలిపారు. పలువురు వృద్ధ పింఛనుదార్లను, ట్రెజరీ అధికారులను సంఘ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యం, పెన్షనర్లు పాల్గొన్నారు.


వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు



గవరపేటలో మత్స్యావతార వేంకటేశుని పూజలో అర్చకుడు



గవరపాలెం కోదండరామ లక్ష్మీగణపతి ఆలయంలో భజనలు చేస్తున్న భక్తులు



మత్స్యావతారంలో ధ్యాన మందిరంలోని వేంకటేశ్వరస్వామి

కశింకోట: స్థానిక ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు వైభవోపేతంగా మొదలయ్యాయి. శనివారం అర్ధరాత్రి దాటాక సంప్రదాయంగా నెలగంటతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యుల ఆధ్వర్యంలో అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. ఆదివారం వేకువ జామున తిరప్పావై పాశుర విన్నపం జరిపారు.

- స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్వామి వారిని విష్ణుమూర్తి దశావతారాల్లో మొదటిదైన మత్స్యావతారంలో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.
- గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభించి మత్స్యావతారంలో స్వామిని అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ భీశెట్టి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అనకాపల్లి: మార్గశిరమాస ఉత్సవాల్లో భాగంగా గవరపాలెం చిన్నబోయి గూడెం వీధి శ్రీరామస్వామి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ కోదండ రామలక్ష్మీ గణపతి ఆలయంలో ఆదివారం ఆలయ అర్చకులు ధనుర్మాస పూజలు నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో తిరుప్పావై పఠనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి రమేష్ మాట్లాడుతూ నెల రోజులపాటు స్వామివారి భజన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు



గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో పిల్లల నృత్య ప్రదర్శన

కశింకోట: స్థానిక పురాతన ఆంధ్ర కల్వరీ సెంటినరీ బాప్టిస్టు చర్చి వద్ద గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తును కీర్తిస్తూ విద్యార్థులు, పిల్లలు, యువకులు బృందాలుగా నృత్యాలు చేశారు. పాటలు పాడారు. స్కిట్లు ప్రదర్శించారు. గ్రాండ్ క్రిస్మస్ పురస్కరించుకుని చర్చిని విద్యుద్దీపాలతో అలంకరించారు. క్రిస్మస్ చెట్టును విద్యుత్ దీపాలతో సిద్ధం చేశారు. పాస్టర్ సన్నిజేమ్స్, సర్పంచ్ మంత్రి జయరజని, చర్చి కమిటీ అధ్యక్షుడు మోజెస్, ప్రతినిధి నాగేశ్వరరావు, హెచ్ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్‌వైజ్‌మెన్, పంచాయతీ కార్యదర్శి ఎన్.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'ల్యాండ్ టైటిలింగ్ చట్టం సరికాదు'

తుమ్మపాల: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ గ్యారెంటీ చట్టం అనేక భూవివాదాలను సృష్టించేలా ఉందని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖరమంత్రి సాయి అన్నారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారదర్శకత, ప్రజాభిప్రాయం లేకుండా చేసిన ఈ విధానం పూర్తిగా వాస్తవ విరుద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సౌజన్య, రాజేష్, రామ్‌ప్రసాద్, ఐవీఎస్ ప్రసాద్, కనిశెట్టి సురేష్‌బాబు, రత్నం, అజయ్ పాల్గొన్నారు.

'కాల్‌సెంటర్ సేవల్ని వినియోగించుకోండి'

తుమ్మపాల: వినియోగదారుల హక్కులు, ఆహార, పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖల సమస్యల పరిష్కారానికి ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్ టోల్‌ఫ్రీ నెం.1967 సేవలను వినియోగించుకోవాలని వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ కోరారు. గౌరీ గ్రంథాలయంలో వినియోగదారుల సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారుల హక్కుల రక్షణ, చైతన్యం ప్రధాన లక్ష్యాలుగా ఈ కాల్‌సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఈ-కామర్స్, డిజిటల్ వర్తక శకంలో వినియోగదారుల రక్షణ అంశంపై హైస్కూలు, కళాశాల స్థాయిలో నిర్వహిస్తున్న కేటగిరీల వారీగా నిర్వహించే వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వినియోగదారుల హక్కుల సేఫ్‌గార్డింగ్ సొసైటీ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, వినియోగదారుల రక్షణ సొసైటీ అధ్యక్షుడు బి.వరహాల దొర, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కామ్రేడ్ శారద ఉద్యమ స్ఫూర్తి ప్రశంసనీయం



కామ్రేడ్ డి.శారద చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పిస్తున్న నాయనబాబు, శంకరరావు

తుమ్మపాల: కామ్రేడ్ డి.శారద విద్యార్థి దశ నుంచే ఉద్యమాలలో పనిచేసి మహిళా ఉద్యమ నిర్మాణానికి కృషి చేశారని, ఆమె ఉద్యమ స్ఫూర్తి ప్రశంసనీయమని రైతు సంఘం జిల్లా కోశాధికారి జి.నాయనబాబు కొనియాడారు. పట్టణంలోని దొడ్డి రాము నాయుడు కార్మిక, కర్షక భవనంలో గంటా శ్రీరామ్ ఆధ్వర్యంలో జరిగిన శారద 19వ వర్ధంతి కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలపై ఆమె చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ శంకరరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో అంగన్‌వాడీ, పలు కార్మిక సంఘాలను నిర్మించి, చివరి వరకు కార్మిక సమస్యల పరిష్కారం కోసం పనిచేశారని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన



ఆందోళనలో అంగన్‌వాడీ కార్యకర్తలు

కశింకోట: కశింకోటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ కోర్కెల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలు, వారి తల్లులతో పాటు నిరసన తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పోషకాహారం అందించి పటిష్టపరచడానికి చర్యలు చేపట్టాలని కోరారు. అంగన్‌వాడీ సంఘం ప్రతినిధి తనూజ, సీఐటీయూ నాయకుడు దాకారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా పింఛన్‌దారుల దినోత్సవం



కశింకోటలో సీనియర్ పెన్షనర్లకు సన్మానం

కశింకోట: కశింకోటలోని పదవీ విరమణ ఉద్యోగుల సంఘ భవనంలో ఆదివారం పింఛన్‌దారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లను దుశ్శాలువాలు వేసి సత్కరించారు. అనంతరం విశ్రాంత ఎంఈవో నంబా రమణ మాట్లాడుతూ ఉద్యోగులు చేసిన సేవలకు ప్రతిఫలమే పింఛన్ అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పాము సూర్యనారాయణ, ప్రతినిధులు కె.కామేశ్వర్, యు.గోపాలకృష్ణ, విశ్రాంత ఉద్యోగులు సోమేశ్వరరావు, కె.రామునాయుడు, కె. కృష్ణవేణి, పీఆర్‌కే శర్మ, వి.రామచంద్రరావు, సంఘ కోశాధికారి బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

కశింకోట: రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, పీఆర్టీయూ రాష్ట్ర నాయకుడు గాదె శ్రీనివాసులునాయుడు కోరారు. స్థానిక ప్రమీలాతోటలో ఆదివారం నిర్వహించిన పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యాయుల వనసమారాధనలో ఆయన మాట్లాడారు. జీపీఎస్ పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదన్నారు. పింఛన్‌దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుద్ధ కాశీవిశ్వేశ్వరరావు, ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, పారిశ్రామికవేత్త దిలీప్ చక్రవర్తి, సంఘ ప్రతినిధులు పెనుమత్స కృష్ణంరాజు, బుద్ధిగ అప్పారావు, గంట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ 1990-91 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

కశింకోట: స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990–91 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకుని, యోగ క్షేమాలు తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

తుమ్మపాల: గవరపాలెం ఎంజీహెచ్ స్కూల్ 1997–98 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు స్థానిక కర్రి రమేష్ కల్యాణ వేదికలో ఆదివారం ఘనంగా జరిగాయి. బొడ్డేడ మురళి కాండ్రేగుల మోహన్, షేక్ చోటా, మారిశెట్టి తారక ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ముందుగా పాఠశాలలో నెలకొల్పిన సరస్వతీదేవి విగ్రహానికి పూలమాలవేసి, గురువులను సత్కరించారు. సాయంత్రం వరకు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.